

నీలంరాజు దండకవిల



నీలంరాజు పార్థసారథి



ముక్కోటికి గరుడ వాహనంపై
వేణుగోపాలస్వామి



శ్రీ ఆంజనేయస్వామి
(వేణుగోపాలస్వామి గుడిలో), కోరిశపాడు



రుక్మిణి, సత్యభామ, ఆంజనేయస్వామి సమేత
వేణుగోపాలస్వామి నూతన ఉత్సవ విగ్రహములు



శంఖచక్రధరం కృష్ణం క్రోశగ్రామ నివాసినం !
హస్తవిన్యస్త వంశాఢ్యం నౌమి గోపాల దైవతం !!

శ్రీ వేణుగోపాలస్వామి - కొరిశపాడు

సెప్టెంబర్ 2014

వెల : అమూల్యము

ప్రచురణ: నీలంరాజు చారిటబుల్ ట్రస్ట్
డోర్.నెం.8-1-43, జమ్మిచెట్టువీధి,
కొత్తపేట, ఒంగోలు - 523 002,
ప్రకాశంజిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ : 99632 88047

ప్రింటింగ్: జి. ప్రశాంత్‌కుమార్
షాపు నెం.13, శ్రీనివాసకాంప్లెక్స్,
కర్నూల్‌రోడ్, ఒంగోలు
సెల్ : 9640080064

నీలంరాజు దండ కవిత

మున్నుడి

ఇపుడు మీ ముందున్న ఈ 'నీలంరాజు దండ కవిలె' వయస్సు దాదాపు 150 సంవత్సరాలు. మా తండ్రిగారు కీ॥శే॥ నీలంరాజు ఆదిమూర్తిగారు 29-1-1948 తేదీన తాటాకు ప్రతులనుండి మూడవ ప్రతిగా నొక దానిని సేకరించారు. దీని తాలూకు మూలప్రతి రాగిరేకులను పూర్వీకులు మదరాసు (నేటి చెన్నై)లోని పురావస్తు ప్రదర్శనశాల (మ్యూజియం) కు ఇచ్చియున్నారు. మా తండ్రిగారు స్వర్గస్థులైన పిమ్మట మా పిన తండ్రిగారు కీ॥శే॥నీలంరాజు వేంకట సుబ్బారావు గారు మరల ప్రయత్నించి శుద్ధప్రతి నొకదానిని తయారుచేసినారు. అదే ఇపుడు పుస్తక రూపాన్ని సంతరించుకున్నది.

ఈ గ్రంధమును మొదట పరిశీలించినపుడు దీనికి చారిత్రక నేపథ్యం ఉన్నదా? లేదా? అనే సంశయం నాకు కలిగింది. కొంతకాలం తర్వాత ఇందులో విజయనగర సదాశివరాయల ప్రస్తావన నా ఆలోచనలకు బలం చేకూర్చింది. నీలంరాజు వారి వంశ చరిత్రను ఏ విధముగానైనా ముద్రణ చేయించాలని మా బాబాయి గారు మరీమరీ చెప్పి యున్నారు. ఆయన సంకల్పమే నేటికి ఫలించినది. ఆయన వంశాభిమాని.

ఈ చరిత్రకు మూలపురుషులు "నీలంరాజు నారాయణప్ప, నీలంరాజు వేంకటపతి" అనువారు. వారి ఏలుబడిలో కొరిశపాడు గ్రామంలో హరిహరాలయముల ప్రతిష్ఠ జరిగింది. ఇవియే ఇప్పటి వేణుగోపాలస్వామి వారి ఆలయం, నీలకంఠేశ్వరస్వామి ఆలయములుగా ప్రసిద్ధి చెందినవి. ప్రకాశంజిల్లా, కొరిశపాడు గ్రామం, మేదరమెట్ల హైవే నుండి గుంటూరు రోడ్డులో 3 కి.మీ.లో దూరములో ఉన్నది. తరచితరచి చూడగా ఈ దేవాలయాల చరిత్ర దాదాపుగా 15,16 శతాబ్దాలకు సంబంధించినదిగా నిర్ధారణయైనది.

ఈ విషయములో నా స్నేహితుడు చరిత్ర అధ్యాపకుడు కీ॥శే॥మక్కపాటి విశ్వేశ్వరశర్మ విజయనగర చరిత్రకు సంబంధించిన గ్రంధములనిచ్చి చదువుమని ప్రోత్సహించారు. వారి సలహా సంప్రదింపులతో ఇప్పటికి 10 సంవత్సరాలనుండి దీనిపై అధ్యయనము, పరిశీలన జరిగినవి. ఈ సమయంలో సి.యస్.ఆర్. శర్మ కళాశాలకు చరిత్ర అధ్యాపకులుగా డా॥ కె.శ్రీనివాసులు గారు వచ్చారు. శాసనాలపై మిక్కుటమైన

పరిశోధనలు చేసిన డా॥ శ్రీనివాసులుగారిని కలిసి ఈ ప్రతిని చూపి దీని సాధికారత తెలుపవలసినదిగా అడిగాము. ఆయన వ్రాతప్రతిని తీసికొని దాదాపు 6 నెలలపాటు పరిశీలించి అనేక శాసనాలను సరిచూచి తుదిగా 6 నెలల క్రితం వారి అభిప్రాయాలను సాధికారికముగా వ్రాసి యిచ్చియున్నారు. ఇప్పటికి అన్ని ప్రతులు పరిశీలిస్తూ మార్పులు, కూర్పులు, చేర్పులు సంతరించుకుంటూ చివరకు ఈ రూపములో మీ ముందుకు వచ్చినది.

ఈ చరిత్ర 13వ శతాబ్దానికి పూర్వం ఉన్న **నీలంరాజు వంశీకుల కుటుంబ చరిత్ర.** వీరు ఆదిలో రాజమహేంద్రవరమునకు చెందినవారు. నాటి రాజుల పాలనలో దానాలు, ఫర్మానాలు గ్రహించి కొరిశపాడు, అద్దంకి, మణికేశ్వరం, అమ్మనబ్రోలు, ఉప్పలపాడు, మల్లవరం గ్రామాలలో ఆధిపత్యము, దేవాలయ, తటాక, విగ్రహాది ప్రతిష్ఠలొనరించిన కధనము ఆశ్చర్యము కల్గించకమానదు. కాగా వీరు ప్రాధమికంగా క్షత్రియులై, పిమ్మట బ్రాహ్మణులై పోయినట్లుగా తెలియచున్నది. వీరి గోత్రము కూడా హరిత, అంబరీష, యవనాశ్వ అయిన త్రయార్షేయము. కనుక విశ్వామిత్ర గోత్రీకులు. అందుచే వీరిలో యుద్ధము, సంధి జీవనశైలియై ఉన్నది.

ఇది కేవలం కుటుంబ చరిత్ర మాత్రమే అయితే దీని కోసమింత శ్రమించ పనిలేదు. ప్రకాశం జిల్లాలోని పూర్వరాజుల ఏలుబడులు, దానధర్మాలు, చారిత్రక విషయాలతో నిండియుండుటచే పూర్వులు చేసిన దొడ్డపనులను ఈ తరంవారు గ్రహించుట మంచిదనీ, చారిత్రక పరిశోధకులకిది ఉపయోగపడుననీ భావించి యీ ముద్రణ భారాన్ని వహించాము. ఈ శ్రమకు పరిపూర్ణఫలం లభించుట కొరిశపాడులోని శ్రీవేణుగోపాల స్వామి వారి యొక్క అనుగ్రహమే. ఈ సంకల్పానికి బలమిచ్చిన మా బాబాయిగారికి నా శ్రద్ధాంజలులు.

1908లో ఒకమారు శ్రీమాన్ పాలపర్తి లక్ష్మీనృసింహస్వామి వారి ఆధ్యక్ష్యంలో శ్రీ వేణుగోపాల దేవాలయమును జీర్ణస్థితినుండి ఉద్ధరించారు. దశావతారాలతోరణముతో క్రింద రుక్మిణీ సత్యభామలతో కలిసి ఏకశిలా రూపములోనున్న శ్రీ వేణుగోపాలమూర్తి బహుసుందరమైనది. ఇచటి శ్రీ ఆంజనేయస్వామి వరదాత.

కీ.శే. నీలంరాజు ఆదిమూర్తి గారు వేణుగోపాలస్వామి వారికి సర్వాంగాన్ని, వారి అక్కగారు మూర్తమ్మ గారి పేరిట పెద్ద గంటను దేవునికి సమర్పించినారు. 1967 వరకు ప్రతి సంవత్సరము స్వామి వారికి కళ్యాణోత్సవములు జరిపించి ఉన్నారు.

నీలంరాజు వారికి 'దేశపాండ్య'యను బిరుదు కలదు. సదాశివరాయల కాలం నుంచి మాన్య గ్రహీతలకు స్థలకరణీకులగు పాలకులకు ఇవ్వబడినది.

మరలా 2003 సంవత్సరములో మా బాబాయిగారు కీ.శే.నీలంరాజు వేంకటసుబ్బరావుగారు దేవాదాయశాఖ వారి సహాయముతో, నీలంరాజు వంశస్థుల విరాళంతోను రెండవ జీర్ణోద్ధరణ జరిపియున్నారు.

ఈ దేవాలయ పరిరక్షణలో మా కుటుంబమునకును, దేవాలయమునకును సంపూర్ణ సహకారం అందించిన కొరిశపాడు వాస్తవ్యులు శ్రీ కడివేటి విశ్వనాథరెడ్డి, శ్రీ దొడ్ల రంగారెడ్డి, శ్రీ దొడ్ల సత్యనారాయణరెడ్డి గారికిని నేను సదా కృతజ్ఞుడను.


ఈ గ్రంథమునకు ఆశీస్సులందించిన కుర్తాళం పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి వారి పాదపద్మములకు నా నమోవాకములు. తన సమయాన్ని దీని పరిశోధనకు కేటాయించి అమూల్యమైన తన అభిప్రాయాన్ని యిచ్చిన శర్మకళాశాల చరిత్ర అధ్యాపకులు డా॥ కె.శ్రీనివాసులు గారికి, ప్రూఫులను సరిచేసిన తెలుగు పండితులు డా॥జె.జానకీరామశర్మ గారికినీ, అడుగగానే తమ అభిప్రాయమును వ్రాసియిచ్చిన ప్రకాశం జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంటు కమీషనరు శ్రీ కె.బి. శ్రీనివాసరావు గారికి నా కృతజ్ఞతలు. శ్రమకోర్చి డి.టి.పి తీయించిన మా మూర్తి గారికి, దీనిని పుస్తకరూపంలో ప్రచురణ చేసిన అన్నా గ్రాఫిక్స్ ప్రశాంత్‌కుమార్ గారికి అభినందనలు.

శ్రీ వేణుగోపాలుని అనుగ్రహమును కోరుతూ దీనిని భగవదర్పణము చేస్తున్నాను.

తేది.23-08-2014

నీలంరాజు పార్థసారథి
సంపాదకుడు

అభినందనలు



శ్రీ కె.బి. శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమీషనర్
దేవాదాయశాఖ, ప్రకాశంజిల్లా. ఒంగోలు.

నేను 'నీలంరాజు వారి దండ కవిలె" అనే ఈ చిన్న పుస్తకమును చూశాను. సాధారణంగా వంశ చరిత్రలను "కవిలె' అనే తాళపత్రప్రతులలో వ్రాయుట తెలిసిందే. ఈ ప్రతిలో "నీలం రాజు వారి వంశ చరిత్ర" మరియు అద్దంకిసీమలో ఉన్న అద్దంకి, మణికేశ్వరం, కోరిశపాడు గ్రామాలలోని అనేక దేవాలయాలు జీర్ణోద్ధరణ, ప్రతిష్ట మొదలైన విషయాలెన్నో తెలియజేయబడుతున్నాయి.

12,13 శతాబ్ధాలకు చెందిన కాకతీయ గణపతిదేవ చక్రవర్తి, గోపరాజు రామయ మంత్రి తర్వాత కాలంలో విజయనగరానికి చెందిన సదాశివరాయలు, గణపతులు, వేంకట గిరిరాజులు, వంగవోలు మందపాటి రాజులు మున్నగు రాజులను గూర్చి అనేక చారిత్రక విషయాలు ఇందులో ప్రస్తావించబడ్డాయి.

నీలంరాజు నారాయణప్ప, వేంకటపతి అనువారు కొరిశపాడులోని శ్రీ వేణుగోపాలస్వామి, నీలకంఠేశ్వరస్వామి వారలను ప్రతిష్టించుట, వారు చేసిన దానధర్మాలు, ప్రకాశంజిల్లా మాండవిక చరిత్రలో నూతన నేపథ్యాలు మొదలైన విషయాలు ఇందులో వివరంగా ఉన్నాయి. చరిత్ర పరిశోధకులకు ఇది బాగా ఉపయోగపడుతుందని నా విశ్వాసము. శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త అయిన శ్రీ నీలంరాజు పార్ధసారథిగారు దీనిని ప్రచురించినందులకు అభివందనలు తెలుపుతున్నాను. ఈ దేవాలయాలు మా దేవాదాయశాఖ క్రింద ఉండుట మాకెంతో గర్వకారణము.

తేది. 23-08-2014

కె.బి.శ్రీనివాసరావు

సంతకం

నా మాట



డా॥ కె. శ్రీనివాసులు, M.A., Ph.D
చరిత్ర అధ్యాపకులు
సి.యస్.ఆర్. శర్మ కళాశాల
ఒంగోలు.

ప్రాచీన కాలం నుండి తమ జ్ఞాపకాలను భావితరాలవారికి అందించేందుకు అనూచానంగా వివిధ సాహిత్య ప్రక్రియలద్వారా మన పూర్వీకులు ప్రయత్నిస్తూ వచ్చారు. ఏవో కొన్ని కాల్పనిక కావ్యాలు తప్ప పురాణేతిహాసాలన్నీ ఈ దృష్టితోనే రచించారు.

సర్గశ్చ ప్రతి సర్గశ్చ వంశోమన్వంతరాణి చ
వంశాను చరితంచేతి పురాణం పంచలక్షణమ్

పురాణం పంచలక్షణమని ప్రతీతి. పురాణాలలో చెప్పిన ఐదు విషయాలు - సర్గ (సృష్టిజ్ఞానం), ప్రతిసర్గ (పునఃసృష్టి), వంశ (ఋషుల వంశావళి), మన్వంతర (మనువులకాలగణన), వంశానుచరిత్ర (సూర్యచంద్ర వంశాల చరిత్ర) - కూడ తమ జ్ఞాపకాలను, చరిత్రను భావితరాలకు అందించే ఉద్దేశ్యముతోనే రూపొందించారని తేటతెల్లము చేస్తున్నాయి. తరువాతికాలంలో సంస్కృతంలోను ప్రాంతీయ భాషలలోను వచ్చిన కావ్యాలు, నాటకాలు, లక్షణగ్రంథాలు, చారిత్రకాంశాలను కొన్ని వివరంగాను, కొన్ని కొంతమేరకైనా పేర్కొంటున్నాయి. 18-19 శతాబ్దాలలో గ్రామాల చరిత్రను కైఫియ్యతులు, దండకవిలెల పేరుతో గ్రామ కరణాలు, ఈస్టిండియా కంపెనీ ఉద్యోగులు తయారుచేశారు. కర్ణాటక యుద్ధాల వలనను, సైన్యసహకార ఒడంబడిక కారణంగాను నైజాం నవాబు నుండి ఉత్తర సర్కారులు, దత్తమండలాలు, ఈస్టిండియా కంపెనీకి సంక్రమించాయి. ఈ విధంగా సంక్రమించిన భూభాగాల ప్రజల చరిత్రను సంస్కృతిని తెలుసుకొనుటకు కంపెనీ ప్రభుత్వం కల్నల్ మెకంజీని నియమించింది. కంపెనీ ప్రభుత్వ ఆదేశం ఈ విధంగా ఉంది "

"to undertake a survey on an extensive scale of the teritories lately subjected to the company. The attention of the surveyor was not to be confined to mere military or geographical figures of statistical accounts of the whole country".

కంపెనీ ప్రభుత్వ ఆదేశానుసారం మెకంజీ గ్రామాల చరిత్రను సేకరించుటకు కావలి వెంకట బొర్రయ్య, మొదలగు వారిని సహాయకులుగా నియమించుకొన్నాడు. దత్తమండలాలలోని గ్రామాల చరిత్రను 1814 నాటికి మెకంజీ పూర్తి చేయించాడు సర్కారు జిల్లాలలోని గ్రామాల కైఫియ్యత్తుల సేకరణ క్రీ.శ. 1797 నుండే ప్రారంభమైంది. క్రీ.శ. 1797లో మెకంజీ ఒంగోలులో మకాం వేసినపుడు అమరావతీ స్తూపాన్ని గురించి విని అమరావతికి వెళ్ళి అమరావతిస్తూపశిల్పాల చిత్రపటాలను తయారుచేసి వాటి వివరాలను ప్రకటించాడు. సర్కారు జిల్లాల గ్రామాల కైఫియ్యత్తులను ఆయా గ్రామాల కరణాలచే క్రీ.శ. 1813 నాటికి పూర్తి చేయించాడు. ఈ కైఫియ్యత్తులను వ్రాసే సమయంలో మెకంజీ గుమస్తాలు, గ్రామ కరణాలు తమకు తరతరాలనుండి వస్తున్న సమాచారాన్ని గ్రంథస్తం చేసే ప్రయత్నం చేశారు. అయితే కొన్ని చోట్ల తాము మరచిపోయిన విషయాల స్థానంలో తమకు తోచిన విషయాలను వ్రాసిన సందర్భాలు కూడ ఉన్నాయి.

నీలంరాజు వారి దండకవిలె కూడ ఈ కోవకే వస్తుంది. కాని దీనిని మెకంజీ వ్రాయించలేదు. ఈ దండకవిలెను నీలంరాజు వారి వంశంలో ఎవరో తాళపత్రాలపై వ్రాయగా దానిని మరలా కాగితంపై వ్రాసిఉంచారు. దానిని నీలంరాజు ఆదిమూర్తిగారు 1948 సం॥లో మరల శుద్ధప్రతిని తయారు చేశారు. ప్రస్తుతం మనము చూస్తున్న దండకవిలె మూడవదఫా వ్రాయబడినది. మొదటి తాళపత్ర ప్రతిలోని కొన్ని తాళపత్రాలు విరిగిపోగా రెండవ దఫా వ్రాసిన కాగితపు ప్రతిలో కొన్ని చోట్ల కాగితం శిధిలమైనట్లు తెలుస్తుంది. అందువలను కొన్ని సందర్భాలలో సమాచారము పూర్తిగా లభించుటలేదు. నీలంరాజు వారి దండకవిలె ప్రకారం రాజమహేంద్రవరం నుండి పెద్ద అన్నంరాజు చిన్న అన్నంరాజు అనేవారు ఇద్దరు ఉప్పలపాడు వచ్చి ఆ గ్రామ కరణీకం పొందినట్లు తెలుస్తున్నది. దీనిని బలపరచే సాక్ష్యం ఉప్పలపాడు కైఫియ్యత్తులో లభిస్తున్నది...

సత్తెనపల్లి తాలూకా నాదెండ్ల సముతులోని వుప్పలపాడు గ్రామ కరణాలు వుప్పలపాటి సూర్యరాజు సుందరరామన్న క్రీ.శ.1813 జనవరి 28న వ్రాయించిన కైఫియ్యత్తు ప్రకారం 'గజపతి సింహాసనస్థుడైన విశ్వంభరదేవు ప్రబలుండై పంన్నెండ్డు సంవ్వత్సరములు ప్రభుత్వము చెశ్ని మీద యితని కొమారుడైన గణపతి దెవ మహారాజులుంగ్గారు శాలివాహనం ౧౦౫౬ (1134 A.D.) పట్టాభిషిక్తుడై ప్రభుత్వం చెశెటప్పుడు విరిదగ్గిర మహాప్రధానులైన గోపరాజు రామన్నగారు శాలివాహనం ౧౦౬౭ (1145A.D) అగునెటి రక్తాక్షి సంవ్వత్సర బాద్రపద బ 30 అంగ్గార్క వారం సూర్య గ్రహణకాలమంద్దు కృష్ణానదీ తీరమంద్దు ప్రభువు దగ్గెర దానం పట్టి సమస్తమయ్ని నియ్యోగుల్కు గ్రామ కరిణీకపు మిరాశిలు నిన యించ్చె యడల యీ గ్రామాన్కు వెలనాడు హరితసగోత్రులైన నీలంరాజు పెద్ద అంద్దెంరాజు అనెవారికి యెకభోగముగా రస్మితేజో పాజు నులు(?)తో కూడ మిరాశి నిన యించ్చినారు గన్కుతధాది మొదలుకొని యెతద్వంశీకులైన వారు వుప్పలపాటి వారనె అభిదానం చాంతను అనుభవిస్తూ వుంన్నారు."

ఉప్పలపాడు గ్రామ కైఫియ్యత్తు ప్రకారం వెలనాడు హరితసగోత్రులైన నీలంరాజు పెద అంద్దెంరాజు అనే వారికి ఏక భోగముగా వుప్పలపాడు గ్రామాన్ని మిరాశిగా ఇచ్చారు. అప్పటినుండి నీలంరాజువారు కాలక్రమంలో వుప్పలపాటి వారనే ఇంటిపేరుతో ఆ గ్రామ మిరాశీ అనుభవిస్తున్నట్లు తెలుస్తున్నది. కాని నీలంరాజు వారి దండకవిలెలో నీలంరాజు వంశీకుల మొదటి వారి పేర్లు పెద్ద అన్నంరాజు, చిన అన్నంరాజు అని ఉండగా ఉప్పలపాడు కైఫియ్యత్తు వీరిలో పెద్ద అన్నంరాజును పెదఅంద్దెంరాజు అని ఇంటిపేరు మొదటి నుండి నీలంరాజు అని చెబుతున్నది. ఇక నీలంరాజు వారి దండకవిలెలో చిన్నఅన్నంరాజు కుమారుడు నీలంరాజు అని అతని పేరుమీదనే వంశనామము నీలంరాజు అని వచ్చినట్లు పేర్కొంటున్నది. అంతేకాకుండా చినఅన్నంరాజు గారికి అద్దంకి, అమ్మనబ్రోలు సీమల స్థలకరణీకము గోపరాజు రామన్నగారు ఇచ్చినట్లు ఈ దండకవిలె వలన తెలుస్తున్నది. దీనిని బలపరిచే సాక్ష్యం గుంటూరు కైఫియ్యత్తులో లభిస్తున్నది. పెదనాగదేవభట్టు (1328A.D.) వ్రాసిన దండకవిలెలో గణపతి దేవుని

మహాప్రధాని శాలివాహనశకంలో ౧౦౬౭ గణపతి దేవుని చేత ధారాదత్తము పట్టి నియోగులకు ఇచ్చిన కరిణీక స్థావరాల వివరాలున్నాయి. ఆ వివరాల ప్రకారం "కొండవీటి కిందను చెల్లె చీమలు ౧౪కి దేశం పెత్తనం యిచ్చిన మిరాశీలు నియ్యోగులకు అద్దంకిన, అమ్మనబ్రోలు సీమలికి జుమలా సంప్రతులు నాల్గింటికి సంప్రతులు, వెలనాడు, వేంగినాడు సంప్రతులు, నీలంరాజు వారనేటి వార్కి సంప్రతి పోలంరాజు వారు అనే వారికి సంప్రతి దామరాజు అనేవారికి సంప్రతి అద్దంకివారు అని గ్రామ నామం సంప్రతి యీనాలుగు సంప్రతులు అద్దంకి అమ్మనబ్రోలుకు జమలాగా యిచ్చెను".

ఇందు పేర్కొన్న వెలనాడు ఆరువేలగ్రామ పరిమితిగల ప్రదేశ మని శాసనాలవలన తెలుస్తున్నది. తెనాలి, రేపల్లె తాలుకాలు, గుంటూరు తాలూకాలో కొంతభాగము కలసిన ప్రాంతమును పూర్వము వెలనాడని వ్యవహరించేవారు. వేగినాడు పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, కైకలూరు, కృష్ణాజిల్లాలోని గుడివాడ, బందరు తాలుకాల ప్రాంతము.

మెకంజీ కైఫియ్యత్తులద్వార గోపరాజు రామమంత్రి గురించి తెలుస్తున్న వివరాలు :

ఇతడు గణపతిదేవ చక్రవర్తి బ్రాహ్మణ మంత్రులలో సుప్రసిద్ధుడు. గణపతి దేవుని కాలము వరకు విశ్వబ్రాహ్మణులమని చెప్పుకొను కంసాలురు, శూద్రులు మాత్రమే గ్రామ కరణాలుగా ఉంటూవచ్చారు. గణపతి చక్రవర్తి బ్రాహ్మణుల పట్ల అభిమానము కలిగి ఉండుట చేత ఆ ఉద్యోగములన్ని నియోగి బ్రాహ్మణుల కిప్పించవలసినదిగా తనమంత్రులలో ఒకడైన గోపరాజు రామప్రధానిని నియమించెను. చక్రవర్తి ఆజ్ఞప్రకారము రామప్రధాని నియోగి బ్రాహ్మణులకు మిరాశీలను ఏర్పరచి తెలుగు రాజ్యమంతటా నియోగి బ్రాహ్మణులనే కరణములుగా నియోగించెనని గుంటూరు, ప్రకాశం జిల్లాలలోని ప్రతి గ్రామ స్థానిక చరిత్రలో వ్రాయబడి ఉన్నది. కాని గణపతి దేవుని గజపతి రాజుల శాసనాలలో ఎక్కడా గోపరాజు రామన్న మంత్రి పేరు కనిపించుటలేదు.

కోస్తా ప్రాంతంలోని గ్రామ కైఫియ్యత్తులలో లంభించే గోపరాజు రామన్న గురించి సమాచారం :

గోత్రశాస్త్రాబ్ధ శీతాంశు సంఖ్యాబ్దేశాలివాహనే।
గ్రామస్థావర వృత్తిశ్చకృతివాన్ గణకాగ్రణీ:॥
శ్రీమాన్ గణపతిర్భూపో గజపత్యన్వయోద్భవ: ॥।
అస్తిభూమండలేతస్య । బహవస్తంత్రిమంత్రిణ: ॥
తేషాం శ్రేష్ఠ తమోకమాత్య: యాజ్ఞవల్క్యోత్తమోద్విజ:
గోపరాజాన్వయోత్పన్నో రామాభ్యో గణకాగ్రణీ:
రక్తాక్ష్యబ్దే మాసి భాద్రపద బహుళ పక్షే
వరార్కగ్రహే పుణ్యకాలే ऽ ంగారకవాసరే ।
గణకానాం హితార్థాయ సద్యశ : స్థాపనాయ చ
తిష్ఠత: శశిమార్తాండయావత్తా వ్రతువృద్ధయే
రాజాజ్ఞగ్రాహతత్రాపం కృష్ణవేణీ తటే తదా ।
గ్రామస్థావర వృత్తీనాం సాక్షిణ స్సర్వదేవతా: ॥

ఈ విధంగా ఆంధ్రదేశమంతటా ముఖ్యంగా సర్కారు జిల్లాల ప్రాంతమంతటా ఇతని ప్రసిద్ధి వ్యాపించినదనుట వాస్తవం, భావి పరిశోధనల వలన ఇతని చరిత్ర తెలుస్తుందని ఆశిద్దాం.

నీలంరాజు వారి దండకవిలె పేర్కొంటున్న చారిత్రక వ్యక్తులు లాంగూల గజపతి, శ్రీసదాశివరాయలు, మందపాటి జమిందారులు, శిద్దిరాజు తిమ్మయదేవ మహారాజు వెలుగోటి కుమార యాచమనాయకుడు, వెలుగోటి పెద యాచమనాయకుడు మొదలైన వారున్నారు. వీరిలో లాంగూల గజపతి గురించి కోస్తా జిల్లాలలోని గ్రామ కైఫియ్యత్తులలో కొంతసమాచారము లభిస్తున్నది. వాటి ప్రకారం కళింగ రాజ్యానికి చెందిన గజపతి కొండవీడు రెడ్డి రాజులను ఓడించి తీరాంధ్రను 12 సం॥లు పరిపాలించాడని ఉదయగిరి దుర్గాన్ని ఇతడే నిర్మించాడని తెలుస్తున్నది. స్థానిక చరిత్రలలో కాకుండా ఇతరత్రా మనకు ఇతని గురించి వివరాలు లభించుటలేదు. సదాశివరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన తుళువ వంశానికి చెందిన వాడు. ఇతను క్రీ.శ 1543-1576 వరకు పరిపాలించాడు.

నీలంరాజు వారి దండకవిలెలో ప్రస్తావించబడిన మందపాటి రాజులు.

1. శ్రీసదాశివరాయల పాలనాకాలంలో మందపాటి తిరుమలరాజుగారి పౌత్రులున్ను భావరాజుగారి పుత్రులున్ను అయిన తిరుమల రాజుగారు హరితసగోత్ర ఆపస్తంభ సూత్రులున్ను నీలంరాజుగారి పౌత్రులున్ను లక్ష్మయ్య గారి పుత్రులున్ను అయిన రాఘవయ్య గారికి యిచ్చిన భూదాన ధర్మశాసనమెట్లన్నను "మాకు శిద్ధిరాజు తిమ్మరాజయ్య దేవమహారాజులుంగారు అమరానకు పాలించి యియ్యనవధరించిన అద్దంకి అమ్మనబ్రోలు సీమలకు మద్దులూరు గ్రామానకు వేములపాటి పొలిమేర వెంటను 3 కుచ్చెళ్ళ క్షేత్రము సహిరణ్యోదకదానధారాపూర్వకముగను యిస్తిమి". సదాశివరాయలకాలంలో కొండవీటి సీమ నాయంకరుడు మహామండలేశ్వరుడు సిద్ధిరాజు తిమ్మరాజయ్య. ఇతని శాసనాలు గుంటూరు తాలూకాలో బడే పురం, ఎల్లమంద, అయినవోలు, శేకూరు గ్రామాలలోను, తెనాలి తాలూకా ఈమని గ్రామాలలోను ఉన్నాయి. ఈ శాసనాలన్నీ క్రీ.శ. 1554 నుండి 1564 సం॥ల మధ్యకాలానికి చెందినవి. సిద్ధిరాజు తిమ్మరాజయ్యదేవ మహరాజు నీలంరాజు రాఘవయ్యకు వేములపాటి గ్రామంలో భూదాన మిచ్చిన కాలం క్రీ.శ. 1554-1564 మధ్య ఉండుటకు అవకాశమున్నది.

2. నీలంరాజు నర్సరాజుగారికి మందపాటి రఘుపతి రాజుగారు కల్వకూరు గ్రామం కావలి మాన్యముగా యిచ్చినట్లు చెప్పబడినది.

మందపాటి రఘుపతిరాజు ఒంగోలు మందపాటి జమిందారులలో ఆరవతరానికి చెందినవాడు. ఒంగోలు జమిందారుల వంశం 1. అయ్యపురాజు 2. మూర్తిరాజు 3. లింగరాజు 4. భోగిరాజు(?) 5. రామభద్రరాజు 6. రఘుపతిరాజు 7. పెదభద్రమరాజు 8. చినభద్రమరాజు 9. రామచంద్రరాజు 10. వెంకటరామరాజు 11. పాపయ్య 12. కుమారవెంకటనరసింహరాజు.


రఘుపతిరాజు క్రీ.శ. 1700 సం॥లో పెళ్ళూరు తాలూకాలోని రాజుపాలెం, మరికొన్ని గ్రామాలు, కడప నవాబునుండి పొందాడు. నిజాంపట్నం దేశపాండే ఒంగోలుకు తూర్పునవున్న మరికొన్ని గ్రామాలను వీరి జమిందారిలో కలిపాడు. ఈ ఈనాములన్ని

క్రీ.శ.1750లో నిజాం నవాబు ఆమోదిస్తూ ఫర్మానా జారీచేశాడు. క్రీ.శ.1755లో రఘుపతిరాజు మరణించాడు. మందపాటి రఘుపతిరాజు నీలంరాజు నర్సరాజులు సమకాలికులు అయినందున నర్సరాజు క్రీ.శ.1700 -1755 మధ్య కాలానికి చెందినవాడు కావచ్చును. తరువాత నీలంరాజు రమణప్పగారికి మందపాటి రామభద్రరాజు, రఘుపతిరాజుగారి యేలుబడిన విరోధము పొసగింది. ఆ తరువాత మరల వారిమధ్య సఖ్యత కుదిరింది. నారాయణప్ప మందపాటి రామచంద్రరాజు, పెద్దరామభద్రరాజు, చిన్నరామభద్రరాజులకు సమలికాలికుడు. వీరి కాలము క్రీ.శ.1756 నుండి క్రీ.శ. 1792 మధ్యకాలము. నారాయణప్ప వెలుగోటి కుమార యాచమనాయుని దర్శించి చేసి బహుమానాలు పొందినట్లు చెప్పబడింది. వెలుగోటి యాచమనాయునికాలము 1762-1804 రామలింగన్న మూడవ కుమారుడు రామన్న మందపాటి రఘుపతిరాజు కుమారుడు చిన రామభద్రరాజుగారి కాలానికి చెందినవాడు. నాల్గవ కుమారుడు వేంకటపతి మందపాటి చిన రామభద్రరాజు కుమారుడు రఘుపతి రాజు యేలుబడిన స్థలకరిణీకము చేసి దర్శి సీమల కరిణీకము నిమిత్తము వెలుగోటి కుమార యాచమనాయుని కుమారుడైన పెదయాచమనాయుడిని దర్శించాడు. ఐదవకుమార్డు నరశింహ్యులు మందపాటి రామచంద్రరాజు కుమారుడు రామభద్రరాజు కాలమువాడు. ఈ రామచంద్రరాజు కాలంలోనే ఈస్టిండియా కంపెనీ 1792లో ఒంగోలు జమిందారీని స్వాధీనం చేసుకొన్నది.

నీలంరాజువారి దండకవిలెలో 1. సదాశివరాయల కాలంలో నీలంరాజు రాఘవయ్యకు ఇచ్చిన భూదాన ధర్మశాసనం, 2. శ్రీరామరాజు శంకరయ్య తరఫ్‌దారు మహాళ్ళాయి పంచాయితి తరపు కందుముగారు నీలంరాజు రామలింగన్న గారికి యిచ్చిన భూదాన శాసనం, 3. మందపాటి రఘుపతిరాజు నీలంరాజు నర్సరాజు గారికి వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసనం, మొత్తం మూడుశాసనాలు నీలంరాజు వంశానికి చెందినవి ఈ దండకవిలెలో ప్రస్తావించ బడ్డాయి. కాని ఈ శాసనాలు ఇప్పటి వరకు ఎక్కడా ప్రచురించబడలేదు. వాటి వివరాలు పూర్తిగా తెలియుటలేదు. 2004లో ప్రచురించబడిన **'నీలంరాజు వంశవృక్షం'**లో నీలంరాజు దాసయ్యగారివద్ద కొన్ని రాగిరేకు శాసనాలుండేవని

తెలుపబడింది. 1941-42 ప్రాంతంలో శ్రీ దాసయ్యగారు ఆ శాసనాలను మద్రాసు తెచ్చి అప్పటి ప్రభుత్వ పురావస్తుశాఖవారికి అప్పచెప్పారు. నాటి ఆంధ్రపత్రిక దినపత్రికలో సంపాదకవర్గంలో పనిచేస్తున్న శ్రీ నీలంరాజు వెంకటశేషయ్యగారు, శ్రీ టి.వి.రంగాచార్యులు వారి ద్వారా ఈ శాసనాలను ప్రభుత్వశాఖకు అందజేశారు అని వ్రాశారు. ఈ తామ్రశాసనం కూడా ఇంకా ప్రచురించబడలేదు.

నీలంరాజు లక్ష్మయ్య అద్దంకిలో తనపేరుతో చెరువును తవ్వించి రెండు వనములను వేయించాడు. నారాయణప్ప అద్దంకి కోటలో లక్ష్మీపతి దేవాలయము తలుపులు పడిపోయి ఖిలపడి వుండగాను కొన్నిస్తంభాలు రాళ్ళబండలు తెప్పించి శ్రీ రఘునాయకుల దేవాలయము, గర్భగృహము, అంతరాళము ముఖమండపము, ఆంజనేయుల మందిరము నిర్మించి తేరు తిరునాళ్ళు జరిపించాడు. కలవకూరులో వనం వేయించారు. కోరిశపాడులో చెరువు, వనము వేయించి దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఘోరకవిపాలెంలోను, గుండ్లకమ్మ తీరంలోను మామిడివనం, నేరేడు వనం వేయించి ఎన్నో ధర్మాలు చేశారు. నారాయణప్ప మణికేశ్వరములోని శ్రీమల్లేశ్వరస్వామివారికి తేరు తిరునాళ్ళు మొదలైన సకల మహోత్సవాలు చేయించి మణికేశ్వరములో నేరేడు వనము వేయించి, కోరిశపాడులో బావులు తవ్వించాడు. రామన్న కోరిశపాటిలో చెరువు తవ్వించాడు. మణికేశ్వరములో మామిడివనం వేయించాడు. మల్లేశ్వరుని తేరు శిధిలమై పోగా బాగు చేయించాడు. వేంకటపతి మణికేశ్వరములో చెరువు తవ్వించి వనము వేయించారు. కోరిశపాడులో హరిహరాలయాలు నిర్మించాడు. మణికేశ్వరములోని మల్లేశ్వరునికి తేరుతిరునాళ్ళు చేయించాడు. మొత్తం మీద నీలంరాజు వంశీయులు సప్త సంతానాలలోని దేవాలయ, తటాక, వన నిర్మాణాలకు పూనుకొని సనాతన ధర్మాన్ని ఆచరిస్తూ ఎన్నో ధర్మకార్యాలు చేసినట్లు ఈ దండకవిలె తెలియచేస్తుంది.



డా॥ కె. శ్రీనివాసులు

శ్రీ :

నీలంరాజు వంశచరిత్ర

ఇది పూర్వము తాళ పత్రముల మీద వ్రాయబడిన దానిని బట్టి పేజీ సంఖ్యవేయుచూ పూర్వం ఒకరు చాలా కాలము క్రిందట వ్రాసిన చాల శిధిలమైన పాతప్రతినిబట్టి మరల వ్రాసికొనుచున్నాను. **నీలంరాజు ఆదిమూర్తి 29 :1 : 48**

1. వంశోద్ధారకుడైన "సకల ధర్మస్వరూపులయిన పురుషులు యేటి అవతల రాజమహేంద్రము నుండి పెద్ద అన్నంరాజు చిన్న అన్నంరాజు అనేవారు ఇద్దరు (ఇక్కడ తాటాకు చినిగినది) కొందెపివద్ద నుండే వుప్పలపాడు వచ్చి ఆగ్రామ కరణీకము వుద్ధరించుకొని అక్కడ నిలిచిరి. చిన అన్నంరాజు అద్దంకి, అమ్మనబ్రోలు సీమకు వచ్చి వుద్యోగము ఆ (తాటాకు చినిగినది) కా జేయించికొని సురక్షితముగా జర్పుకుంచూ వుండే దినములలోను వంశోద్ధారకుడు భాగ్యపురుషుడు అయిన కుమారుడు నీలంరాజు అనే పురుషుడు జన్మించెను (తాటాకు చినిగినది) నామానధి నీలంరాజును అనే వంశనామము చేతను మున్ను స్వతాతన పౌరుషేయముచేతను అద్దంకి అమ్మనబ్రోలు సీమలు (తాటాకు చినిగినది) క్రము వ్రాస్తూ యుండె దినము (తాటాకు చినిగినది) గణక నిర్వాహకుడు అయిన సర్వోత్తముడు లాంగూల గజపతిచేతను ధారా గ్రహీతాలు బట్టి దేశాల వెంబడి వస్తూ శూద్రకరిణీకాలు (తాటాకు చినిగినది).

2. బ్రాహ్మణులకు కరణీకాలు యిప్పించి పుద్ధరించబొయ్యేవేళలను కోట పోరూరి వారు యీ దేశానికి వచ్చి రాణీగానకు వచ్చి గోపరాజు రామన్నగారి దరిశనము చేసిన రామదుసు అద్దంకి, అమ్మనబ్రోలు సీమల స్థలకరణీకము మిరాశి అని చెప్పుచున్నంతలో వారు పూర్వుల ఇనాం ఇప్పడి కాపురం చేశేవారువుండే వారిని మీకు విచారించికొని నడుచు కొమ్మని శలవుయిచ్చి గోపరాజు రామన్నగారు తల్లిపోయిన పిమ్మట కసుపా అద్దంకి వొచ్చి(తాటాకు చినిగినది) స్తే అద్దంకివారు "మేము కసుపా కనిపెట్టివున్నవారము. మాకు లేనిది మీరు యేల నడిచేది పొమ్ముమాదియని నీయకపోయిరి. గనుక మీరు మేమున్నచెరి

సఖముచేసికుందాము" అని సమాఖ్యపడిరి, గనుక ఈ వంశకర్త అయిన నీలంరాజు విని పోరూరివారితోను చాలవివాదపడి "నీవు కోట పోరూరి నుంచి వుద్యోగానికి వచ్చినావు మేము రాజమహేంద్రవరమునుండి వుద్యోగానికి వచ్చినాము. మేము రెండో మన్మంతరము వుద్యోగము యాదేశమున చేస్తున్నాము. నీవు ఈ యేదు వచ్చిన వాడివి మీదారిని నడిచేది యేమి మాకు లేక పొయ్యేది ఏమి అని నిల్వపెట్టెను గనుక మంచిది అని తమ సఖములోనున్న చెరి సఖము అనుభవిస్తాము. తాను వంటరిగాణి, కటకానికి లేఖలు పట్టుకొని పోవలసిన పని వచ్చినది. నీవు లేఖ పత్రములు రాయివినీ నాజవాబిదారుడవు నీవు పోవలెను" అనెను.

3. మంచిది అని సంతోషచిత్తుడు అయి కటకానకుపోయి గజపతి దర్శినము చేసి 12 సంవత్సరములు నిలిచి రాజ...గాను అద్దంకి అమ్మనబ్రోలు పరగణాలకు పాతికెపాలు స్థలకరిణీకము ధారాగ్రహీతము పట్టి ఫరుమానాలు మొదలుగాగల సనదులున్ను ఉద్యోగమున్ను సకల బహుమానాలున్ను బడశి దేశాదుల కరిణీకాలకూ ఆ దినములలో నున్న వార్కి లేఖ పత్రములు పేచీలు నివర్తి చేయించి శలవు యిప్పించి తానున్న శలవు పుచ్చుకొని దేశంలోకి వచ్చెను గనుక ఆ వేళలలో నున్న జగత్తునను లోకవాడికెగాను చెప్పుకొనే మాటలు "కాటికి పోయ్నువాడున్ను కటకానకు పోయిన వాడున్ను తిరిగి రాడని" అనుకొనే కాలములో యీ పుణ్యాత్ముడు జగత్ ప్రసిద్ధిగాను సకల బహుమానములు పొంది దేశములోకి వచ్చి స్థలకరిణీకములు చేసికుంటూ మహారాజుగానుండెను. అద్దంకి వారి సఖ భాగములోను పూసపాటి రామరాజువారికి సఖము యిచ్చి మరివొక వేళలను దివాణానకు లేఖ పత్రములును పెట్టి అంపించిరి గనుక అద్దంకి అమ్మనబ్రోలు పరగణాలు రెండింటికిన్ని అద్దంకివారు, పోరూరివారు, నీలంరాజువారు, దామరాజువారు అనే నాలుగు సంప్రతతులున్ను నిలిచెను. వంశోద్ధారుకుండయ్ని పుణ్యాత్ముడు నీలంరాజుకు సుపుత్రుడయిన భాగ్యవంతుడు లక్ష్మయ్య అనే కుమార్డు కలిగి సకల ధర్మాలున్ను చేశి అద్దంకి వూరచెర్వు "లక్ష్మయ్య చెర్వు" అనె తన నామాంకితానను చెర్వువేయించే.

4. రెండు వనములు వేయించె. స్థలకరిణీకము చేసుకొంటూ అద్దంకిన వుండెను.

ఆపుణ్యాత్మునికి రాఘవయ్య అనే కుమార్డున్ను రామక్క అనే కుమార్తె కలిగినంతల్లోను ఆ చిన్న దానికి వివాహము అయిన వెనుకను చిన్నప్పుడే పెనిమిటి నష్టమైపోయెను గనుక యింటవుండెను. రాఘవయ్య కొణికి వారి యింటను వివాహమై 60 సంవత్సరముల పర్యంతమున్ను సంతానము లేకను కృష్ణాస్నానము పోయి సకల ధర్మాలున్ను చేసి చిలుమూరు పోయి జక్కి వలనుపిలువనంపించె. రామేశ్వరుని దేవళములోను భార్యకు పట్టువస్త్రాలు పెట్టించినంతలోను ఆమెకు ఆవేశ్యము రాకపోయితోడబుట్టువు అయిన రామక్కకు కామేశ్వరి సివంవచ్చి స్థళము--- రాజమహేంద్ర వరముగాను చెప్పుకొని మోకాటి శివము వచ్చి మోకాటి పూజలు వడసి చెప్పుకున్న నిర్ణయము. రాఘవయ్యకు తిరిగి వివాహమయి కమ్మనిన్ని అయిదుగురు కుమారులు కలుగుతూ వున్నారనిన్ని, చిలుమూరి రామేశ్వరుని ----యేకముగాను అయిదుగురికిని ఒక్క నామాంకితము బెట్టుదునన్ని కామేశ్వరుని యింటను తనను వుంచి రుగాలు బిందెలు ఆనందముగ్గులు, సంతర్పణలు మొదలుగా గల సకల సంభ్రమాలున్ను చేస్తూ వుండెను. సకల భాగ్యాలున్ను కలిగి యింతటి మంచి వంశాభివృద్ధి అయి స్థళకరిణీకాలు చేసి భాగ్యవంతులు అయివుందురని రామేశ్వర వరప్రసాదంగాను వుత్తర్వు యిచ్చెను. గనుక మంచిది అని సంతోషచిత్తులు అయి తనకు అందలము భార్యకు, తోబుట్టువు రామక్కకు డోలీలు యినాములతో----- తిరిగి అద్దంకి సీమకు వచ్చి మహద్భాగ్యము అనుభవిస్తూ సంభవించే కాలనిర్ణయిమున్ను అతడు సంపాద్యము చేసిన మాన్యస్వాత్త్వమిరాశీలున్ను శ్రీమన్ మహామండలేశ్వర శ్రీవీరప్రతాప శ్రీ సదాశివరాయులుంగారు విద్యానగరమందు రత్న సింహ్వాసనాసీనులయి పృధివీసంబ్రాజ్యమున్ను చేయుచు వుండగాను కాస్యప గోత్రోద్భవులయ్ని మందపాటి తిరుమల రాజుగారి పౌత్రులున్ను భావరాజుగారి పుత్రులున్ను అయిన తిరుమల రాజుగారు హరితస గోత్ర ఆపస్తంభ సూత్రులున్ను నీలంరాజు గారి పౌత్రులున్ను లక్ష్మయ్యగారి పుత్రులున్ను అయిన రాఘవయ్య గారికి యిచ్చిన భూదానధర్మశాసనమెట్లన్నను "**మాకు శిద్దిరాజు తిమ్మరాజయ్య దేవ మహారాజులుంగారు అమరానకు పాలించి యియ్యనవధరించిన అద్దంకి, అమ్మనబ్రోలు, సీమలకు మద్దులూరు**

గ్రామానకు, వేములపాటి పొలిమేర వెంటను 3 కుచ్చేళ్ళ క్షేత్రము సహిరణ్యోదకదాన ధారాపూర్వకముగను యిస్తిమి గనుక మీ పుత్రపౌత్రపారంపర్యమున్ను ఆచంద్రార్కస్థాయిగాను సుఖాన అనుభవించి బ్రతుకునది అని దాన పత్రము నిర్ణయప్రకారము మద్దులూరు మాన్యమున్ను ఈనాము".

5. పూర్వమే కటకాన నుంచి గజపతి శలవు మీదను వచ్చిన యర్రగొల్లలు గజపతి మన్నెరికము **జన్నావుల మల్లానాయ్డు తిప్పానాయ్డు** అనే ప్రభువులు వారికి జాగీరునడిచె గ్రామాదులు కొండమంజులూరు వంటి గ్రామాదులకు వూరను కుచ్చేల చొప్పునను మాన్యములు **రాఘవయ్యకు** యిచ్చిరి గనుక నున్ను ధర్మవరము పట్టు గ్రామాదులలలోను ధర్మవరానకు చెల్లే గ్రామ కరిణీకము మిరాసి గ్రామాదులు **ధర్మవరము, కొత్తపల్లె, పాతళ్ళపల్లె, పల్లామల్లి, లక్కంరాజుపల్లె, పందలపాడు** యీగ్రామాదుల కరణీకాలు చేసే కరణాలకు సంతతి లేకను ఒకరు యిద్దరు వుండే కలములోను కరిణీకాలు అమ్ముతున్నాము అని హతశేషులయిన ----------వున్న వర్తమానము రాఘవయ్య విని ధర్మవరము వచ్చి తిప్పానాయ్డు, మల్లానాయ్డు గారి దర్శనముచేసి కరిణీకాలు కొనుక్కుంటాను అని శలవు తీసికొని అక్కి సవారీలు కరణాలు, కాపులు, నాయకులు సకల జనసమ్మతముగాను భీమేశ్వరస్వామి ముఖ మంటపము అందునను నిర్ణయము చేసుకున్న పద్ధతి ----------కరణీకము అమ్మే

6. ఆరు గ్రామాదులకున్ను చిమటవారు అనే కరణాలు చేతను పోతరాజుదారు అనే నియ్యోగులకు సఖముగాను కరిణీకమున్ను ఈ రాఘవయ్య సఖము గ్రామకరణీకమున్ను కొని ఆ తిప్పానాయుడు చెంతను రాజదత్తి గాను ధాలంగ్రహితముగా దానపత్ర నిర్ణయము. **"చిమట అన్నమ్మ ఆరు గ్రామాదులు కరణాలకు సఖమున్ను, సహ అతని లోగిలిన్ని సహ అతని మాన్యస్వాత్యమిరాశీలున్ను నీవు క్రయదత్తిగాను కొనుక్కున్నావు గనుక మేమున్ను శ్రీమద్రాజిధిరాజ శ్రీమన్మహీమండలేశ్వర ముద్ర సింహసనాధ్యక్షుడయినా యేలిన గజపతి నాయని గారికి పుణ్యముగాను యీ తథావిధి పుణ్యకాలముందు సహిరణ్యోదక దాన ధారాపూర్వకముగాను యిస్తిమి"** అని దాన పత్రము వ్రాయించికొని కసుపే అద్దంకి వచ్చి

శ్రీ కంఠంవారి యింటను తిరిగి వివాహము భాగ్యవతిని అయినంతల్లోను కలిగిన సంతానము పుణ్యాత్ములయిన వంశోద్ధారకులు కల్గిరి. వారినామాంకితాలు పెదరామ లింగన్న, చినరామలింగన్న, కుమార రామలింగన్న, చిట్టిరామలింగన్న, బోడిరామలింగన్న, అనే కుమాళ్ళు అయిదుగురు జన్మించిరి. వారి వయనము. పెదరామలింగన్నగారికి శ్రీకంఠము వారి చిన్నదాన్ని వివాహము అయి పద్మనాభుడు, కమలనాభుడు అను యిద్దరు కుమాళ్ళు కలిగి కొంతకాము జీవించి నష్టమయిపోయిరి. చిన రామలింగన్నగారికి సంతానము లేకపోయెను. బోడిరామలింగన్న(కడగొట్టు) వివాహపూర్వమే నష్టమాయెను. జల్లిజడల చిట్టిరామలింగన్న సంతతివారు కొత్తకోటలోను కాపురము వుండిరి గనుక వారి సంతతి ముందు వ్రాస్తాను.

7. వంశోద్ధారకుడయ్ని ధర్మస్వరూపి కుమార రామలింగన్నగారికి తుర్క పాపయ్య కొమార్తై వెంగళమ్మ అనే భాగ్యవంతురాలిని వివాహము అయినంతట్లోను కలిగిన సంతతి. **రామన్న, రాగన్నగారు** యిర్వురు కుమాళ్ళును నలుగురు కుమార్తెలు కలిగిరి. కుమార్తెలు నల్గురికి వివాహము చేసిన స్థళాలు కొణికి కామరాజు గణపరాజుకు వెంగమ్మనున్ను పోరూరి వెంకటాద్రికి లక్ష్మమ్మనున్ను నందిగామ వారికి యల్లమ్మనున్ను గొనసపూడి వారికి లింగమ్మనున్ను ఈ రీతిన వివాహాలు చేసిరి. ఆధ్యాత్మిక స్వరూపులయిన రామన్న రాగన్నగారు యిద్దరు కుమాళ్ళు------వంశకర్త అయిన రామన్న పెద్దవానికి వివాహము భాగ్యవతి పుణ్యాత్మురాలు అక్కమ్మను, గర్నెపూడి యల్లమరాజు కుమార్తెను వివాహము చేసికొని ఉన్నంతల్లో కలిగిన సకల ధర్మ స్వరూపులు కుమాళ్ళు పెద్దవాడు ధర్మస్వరూపి నారాయణప్ప, రెండవవాడు పుణ్యాత్ముడు ఆచార్యులు, మూడవవాడు రాజ్యపూజ్యుడు రామలింగన్న, నాలుగవవాడు ధార్మికుడు వేంకటపతి, అయిదవవాడు పుణ్యస్వరూపి కృష్ణంరాజు అనే అటువంటి అయిదుగురు పంచరత్నాలు అనిపించికొనిన కుమాళ్ళున్ను కుమార్తెలు ముగ్గురు గనకవివాహాలు చేశిన స్థళాలు వైనము. మంచెళ్ల శ్రీవేంకటపతికి రంగమ్మనున్ను పోరూరి--------కు తిమ్మమ్మనున్ను, దామరాజు చిట్టిరాజుకోడలు రామక్కకునున్ను యీరీతిని యిచ్చి వివాహములు చేసిరి. ఆధ్యాత్మిక స్వరూపులయిన

రామన్న రాగన్న గారి సంతతికి రామన్న కుమాళ్లు కుమార్తెల సంతతిని వ్రాస్తిని గనుక తమ్ముడు రాగన్నకు వివాహము. తమ్మి-----వారియింటను లింగమ్మను వివాహము సంతతిలేకపోయెను.

8. గనుక అన్నరామన్న కుమాళ్లలోను రెండో పుణ్యాత్ముడు ఆచార్లను దత్తహెూమాది క్రియలు చేసుకొని తాను వుపనయనము చేసుకొని భాగ్యవంతుడయి సకల ధర్మాలున్ను చేసి అన్న నిర్వాహకుడు కాడు గనుక దామరాజు చక్రప్ప కాలమందు వీరికి వారికి పొసగక కొన్ని దినములు దేశాంతరులయిపోయిరి. తిరిగి అద్దంకి వచ్చి చక్రప్ప మీదను-------బాకీ----స్తులు వ్రాయించి గోలకొండ నుంచి వచ్చిన ప్రభువు దర్శినము చేసి చక్రప్ప చేయించిన దురాగతాలు తెల్పుడు చేసినంతల్లోను చాలా చక్రప్ప మీదను ప్రభువు కోపము చేస్తే కట్నమూలముగాను చక్రప్ప బాగుచేసుకున్న మీదను తమ భాగము "నీకు వచ్చిన మనువు మాన్యాలు మేరమిరాశీలు రాబట్టుకొని యారీతిని భాగ్యవంతుడయి వుండి తమ తాత రాఘవయ్య ధర్మవరము పట్టు గ్రామాదుల కరిణీకము కొని అనుభవించెను. జున్నావుల వారి వెంబడిని రాచకరణీకమునకు వచ్చిన వారు ధర్మవరము వారు అనిపించికొని --------వారి జాగీరు నుంచిన్ని వీరు రాచకరిణీకము చేస్తూ వున్నారు. కనుకనున్ను దేశములోకి చక్రప్ప ప్రబలుడు గనుక వీరికి వారికి-----వైరము చేతను నీలంరాజువారు కొన్న కరిణీకము నడుపనీయక గిట్టదు అని ధర్మవరము వారికి అందచేసి రాఘవయ్య కొని తమకు కోరితేయిచ్చి పోయినాడని తగువులు పెట్టించిరి గనుక వీరికి వారికి తగువుపడి యీ దేశములోను తీరలేదు. విజయనగరము క్రోకవి వ్రాయించుకొని తగవుకుపోయిరి.

9.కొన్ని దినములు తగవు చేసికొని శరీరలంపటవచ్చి-----మధ్య వర్తుల చేతను శలవు తీసికొని దేశములోకి రాగన్న వచ్చెను. గనుకను తగవు తీర్చికొక చక్కా పోయినాడని తగువర్ల చేతును జాబులు వ్రాయించికుని ధర్మవరమువారు దేశములోకి వచ్చిరిగనుక వీరి జాడలు రాగన్నవిని తిరిగి విజయనగరము తగువాని నంపించి అక్కడి తగవర్లతోను మాట్లాడితేను" రాగన్న చక్కా పోయినాడని వారు వ్రాయించుకొని పోయినారు. యీసారి

అందరు ప్రత్యర్థులు వస్తే తగవు తీరుస్తున్నామని వుత్తర్వులు తెప్పించి ధర్మవరము వారిని తిరిగి---రమ్మని తగువుకు పిలిస్తే చక్రప్పను అండచేసికొని మునుపే తాను జాబులు మొదలయిన మహర్జీలు తెచ్చుకున్నాము యింతలేదని అహంకారపడి వుండి రాగన్నకు బహుయత్నాలు కట్టి అపాదించి---------పెట్టించి చంపిరి గనుక యీ కరిణీకము వర్తమానము----యీ రాగన్న అనే ధర్మాత్ముడు సంతతిలేక పెంపుడు కుమార్డు అయిన ఆచార్లప్ప గారికి తమ్మవరము వారి యింటను <u>మంగమ్మతో</u> వివాహము అయి భాగ్యవంతుడు అయివున్న దినములలోను కలిగిన సంతతి <u>రాగన్న, రామరాజు, వెంకన్న,జగ్గప్ప, నారాయణప్ప</u> యీ అయిదుగురు కుమాళ్లున్ను, కుమార్లెలు నలుగురు గనుక వివాహాలు అయిన విశదము. యల్లమ్మకు మాచేళ్ళ గిరప్పకున్ను, సానమ్మను కొణికి రామరాజు, రామరాజుల కుమార్డు దేశప్పకున్ను యిచ్చి వివాహము చేసినారు (వేంకటపతికుమారులు).

10. ఆ పుణ్యాత్ములయిన రమణప్ప కోదండ్రామయ్య గారలతోను చిన్నవాడు కోదండ్రామయ్య నష్టము అయిపోయెను. వంశకర్త అయిన రమణప్పగారికి బెల్లంకొండ శిరిగిరి రాజు వెంకన్న కుమార్తె భాగ్యవతి పుణ్యాత్మురాలు నర్సమ్మను వివాహము అయి పుణ్యాత్ములయ్ని భాగ్యవంతులు అయిదుగురు కుమారులు. వారి నామాంకితాలు. వెంకట నారాయణప్ప, రామలింగన్న, రామన్న, వెంకటపతి, నృశింహ్వాలున్ను కుమార్తెలు ముగ్గురున్ను వారికి మనువులు యిచ్చిన వయినము. పేరమ్మను కనుపర్తి ప్రసన్నప్ప కుమార్డు రఘునాయకులుకున్ను, మాలెకొండమ్మను చీమకుర్తి సముతులో వుండే పోరూరి మూర్తిరాజు కుమారుడు కృష్ణంరాజుకున్ను, లక్ష్మమ్మను పమిడిఘంటం దేవరప్ప కుమార్డు గురవరాజుకున్ను యీ ప్రకారం వివాము చేసినారు. కుమాళ్ళు వేంకటనారాయణప్పకు ముదివర్తి నర్సరాజుకుమార్తె నర్సమ్మను వివాహము చేసుకొని రాయవేలూరు పోయి ఆ ప్రభువు దర్శినము చేసి గుఱ్రం, కోకలు, తాళి చేవుకల్లు జోడు.

11. శాలువాలు అందుకొని దేశము తేరుగడ చేసుకొని దేశాయిగిరి చేసే రామరాజు రామేశ్వర రాయుని దర్శినానకు పోయి నాలుగు నగలు, వస్త్రాలు, డాలు తలువారు మొదలయిన అయుధాలు, పల్లకీ మొదలుగాగల బహుమానాలు అందుకొని అద్దంకి,

అమ్మనబ్రోలు, చీమకుర్తి, పెళ్ళూరు స్థల కరిణీకము చేసి, దరిశి సీమల స్థల కరిణీకాలకు బహు యత్నాలు చేసి వెలుగోటి కుమార యాచమ నాయనిగారి దర్శినము చేసి, బహుమానాలు పొంది ఒక కుమారుడున్ను, ఒక కుమార్తె కలిగిన వెనుకను దైవగతి వలన పరలోక ప్రాప్తుడాయెను. కొన్ని దినములకు ఆ కుమార్డున్ను కుమార్తె దైవ సంకల్పము చేత నష్టము అయిపోయిరి. గనుక యీ ధర్మాత్ముడు యింత రామన్న గారి కుమాళ్ల పంచరత్నాలు అనిపించుకున్న వారి అయిదుగురు సంతతి వయినము. పెద్దవాడు ధర్మస్వరూపి నారాయణప్ప"యీ పుణ్యాత్ముని యేలుబడిన కసుపె అద్దంకి కోటలోను లక్ష్మీపతి దేవళము తలుపులికింద ఖిలపడి వుండగాను ఆ స్థంభాలున్ను మరిన్ని కొన్ని స్తంభాలు రాళ్ళు బండలు తెప్పించి శ్రీరఘునాయకులు దేవళము, గర్భగృహము, అంతరాళికము, ముఖమంటపము, యిద్దరు ఆంజనేయులు ముందరను యీలాగునను చేయించి తేరు తిరునాళ్ల మొదలుగాగల సకల సంభ్రమాలున్ను చేయించే. వేలూరి అచ్చిరాజు వారియింటను నర్సమ్మ అనే భాగ్యవంతురాలిని వివాహము చేసుకొని కలవకూరను వనము వేయించి కోరిశపాటను చెర్వు, వనము వేయించి దేవతాప్రతిష్టలు చేయించే, ఘోరకవిపాలెం దగ్గరను, గుండ్లకమ్మ వెంబడిని మామిడివనం, నేరేడు వనము వేయించి సకల ధర్మాలున్ను చేయించి సంతానము లేనందు చేతను తనపినతండ్రి అయిన రాగన్నకు సంతానము లేకపోతే తన తమ్ముడు అయిన ఆచార్లను పెంచుకున్నాడు. గనుక ఆ ఆచార్ల కుమార్డు రామరాజును తన కుమార్డుగాను పెంచుకొని వుపనయనాది క్రియలు జేసుకొని తండ్రి ప్రయోజకుడుగాడు గనుకనున్ను పినతండ్రి రాగన్న శీఘ్రకాలమునందు చనిపోయెను

12. గనుకనున్ను భారకుడు అయి తమ్ములకు వుపనయనాలు పెండ్లిండ్లు కాజేయించి పెంచుకున్న కుమార్డు రామరాజుకు లక్కవరము వారి యింటను రంగరాజు కుమార్తె లక్ష్మమ్మను వివాహము చేసుకొని ముగ్గురు కుమార్తెలు ఒక కుమార్డు గలిగి ఆ కుమార్డున్ను కడగొట్ట కూతురున్ను నష్టమైపోయిరి. కడమ యిద్దరు కుమార్తెలకున్ను లక్కవరం రంగరాజుకు లక్ష్మమ్మునున్ను గంగాధరునకు జానకమ్మనున్ను యిచ్చి వివాహము చేశినారు. అయిన లక్ష్మమ్మ దైవగతి వల్ల నష్టము ఆయెను. గనుక తిరిగి వివాహమును పడి

లకవరము వారియింటను ఆ రంగరాజు తమ్ముడు వెంకటపతి కుమార్తెను వివాహము అయిసంతతి లేకపోయెను. గనుక యితని సంతతి యుంత---రెండవ కుమార్డు ఆచార్లప్పను రాగన్న పెంచుకున్నాడు. గనుక వారి సంతతి వ్రాశినాను. మూడో రాజ్యపూజ్యుడైన **రామలింగన్న** గారికి నందిగామ వారియింటను వెంగళమ్మ అనే ధర్మాత్మురాలి వివాహము అయి గలిగిన సంతాన్నము, సకల ధర్మస్వరూపి సరస్వతి విగ్రహము **రామరాజున్ను**, **అక్కిరాజున్ను** అనే యిద్దరు కుమాళ్ళున్ను వెంగళమ్మ అనే కుమార్తె గలిగితేను మునుములు యిచ్చి వివాహము చేసిన స్థళము టంగుటూరు వేంకటపతికి యిచ్చి వివాహము చేశినాడు. కుమార్డు ధర్మస్వరూపి **రామరాజుకు పూసపాటి రామరాజు తిరుపతయ్య** కుమార్తె శాయమ్మను యిచ్చి వివాహము చేయించి సకల పురాణాలున్ను సకల శాస్త్రాలున్ను చదవి రామరాజు శంకరపుగారి యేలుబడిని శంకరప్ప చేతను చదువునను వ్రాతను లేఖ మెప్పుబడిరి. తెచ్చుకున్న మాన్యాలు------ శ్రీరామరాజు శంకరయ్య తరుపు దారుడు మహాల్లాయి పంచాయితి తరపు కందుముగారు **నీలంరాజు రామలింగన్న**గారికి యిచ్చిన భూదాన శాసన క్రమమెట్లన్నను **"మీ హవాలా నడిచె అద్దంకి అమ్మనబ్రోలు సీమలలోను మా గ్రామ కరిణీకము మీరాసి కలవకూరను నీ కుమార్డు రామరాజుకు మాన్యము యిప్పిస్తిమి గనుక హద్దులు తూర్పునకు అద్దంకి పొలిమేర, దక్షిణమునకు అద్దంకి పొలిమేర,** పడమరకు సింగరికొండ పొలిమేర, వుత్తరమునకు జోడు జమ్ములు యీ చతురశ్రమ హద్దులలోనుగానన్నూరు కుంటల ప్రాప్తన కయిరి.

13. "అయిదు కుచ్చళ్ళ పొలము శ్రీభ్రమరామల్లేశ్వరార్పితముగాను యిస్తిమి" గనుక మీ పుత్రపౌత్ర పారంపర్యతమున్ను ఆ చంద్రార్కస్తాయిగాను సుఖాన అనుభవించి బతుకునది అని యీ ప్రకారం శంకరప్పగారి చేతను దానపత్రిక వ్రాయించుకొని సంతానము లేకను కొంచెము కాలములోనే నష్టము ఆయెను. **రామలింగన్న** గారి రెండవకుమార్డు **అక్కిరాజుకు** కొణిదెన అయ్యవారి కూతురు నర్సమ్మను వివాహము అయి సంతానము లేక నష్టము అయిపోయిరి. అలా ప్రయోజకుడు అయిన పెద్దకుమార్డు రామరాజు నష్టము అయిపోయిన వెనుకను రామలింగన్నగారు బహుసంతాపపడుతువుండి తన తమ్ముడు అయిన కృష్ణంరాజు

రెండవకుమార్డు వంశకర్తఅయిన భాగ్యపురుషుడు నర్సరాజును తన కుమారుడుగాను పెంచుకొని వుపనయనాది క్రియలు చేసుకొనే ను గనుక అద్దంకిని పోలంరాజు వీరరాఘవుని కుమార్తె భాగ్యవతి మూర్తెమ్మను వివాహము చేసికొని రాజశ్రీ మందపాటి రామభద్రి రాజు, రఘుపతి రాజుగారు అన్నదమ్ములు అయివుండె వారి ఏలుబడిని. వీరితోను విరోధము సంపాద్యము అయి పడమటిరాజ్యమునకు పోయి యేండ్ల పర్యంతమున్ను నిలిచి పెరుమాళ్ళ రెడ్డి గారి దరిశనము చేసి పదియిరవై వేల దళాలవారిని దేశాలకు తెచ్చి వారికి భూమి కట్టియిచ్చి కొంతకాలము యధా ప్రకారము సంచరించి పేరు ప్రతిష్ట సంపాద్యము చేసి **రామరాజు మంత్రప్ప** దేశాహిగారి దరిశనము చేసి కలవకూరను సంపాద్యము మాన్యము రాజశ్రీ రామరాజుకు మంత్రప్ప దేశాహిగారు నీలంరాజు నర్సరాజు గారికి యిచ్చిన భూదాన ధర్మశాసన క్రమ మెట్లన్నను మాకు దేశాహిగిరి నడిచే అద్దంకి అమ్మన బ్రోలు కండము సర్కారులో చెల్లే సీమలలోను మీ గ్రామ మిరాసి కలవకూరను మీకు నడిచే దేశాహి మాన్యము మీకు యిస్తిమి గనుక మీ పుత్రపౌత్ర పారంపర్యమున్ను ఆ చంద్రార్కస్తాయిగాను దేశాహి అనుభవించి బ్రతుకునది" యని యీప్రకారము దేశాహి మాన్యమునకు దాన పత్రము సంపాద్యము చేసి రాజశ్రీమందపాటి రఘుపతిరాజుగారితోను సఖ్యపడి యీ దేశమునకు కావలిమాన్యములు మొదలయినవి వారికి కావలశినవి కుదిర్చి నాలుగు సంప్రతుల వారికి సమ్మతము చేసి తనకు మందపాటి రఘుపతిరాజుగారి చేతను చేసుకున్న మాన్య నిర్ణయము.

14.నీలంరాజు నర్సరాజు గారికి మందపాటి రఘుపతిరాజుగారు వ్రాయించి యిచ్చిన భూదాన ధర్మశాసన క్రమమెట్లన్నను "మీకు మన్నె కావలి సందేశము – నడిచె అద్దంకి, అమ్మనబ్రోలు పరగణాలలోను మీగ్రామ మిరాసి కల్వకూరను మీకు నడిచే కావలిమాన్యము **మీకు యిస్తిమి గనుక మీ పుత్రపౌత్ర పారంపర్యంతమున్ను ఆ చంద్రార్కస్తాయిగాను అనుభవించి బ్రతుకునదియని యీ రీతిని కావలి మాన్యము సంపాద్యముచేసి యీ రీతిని భాగ్యపురుషుడయి** వుండే కాలములోను కలిగిన సంతానము ధర్మస్వరూపులు వెంకట్రామప్పయున్ను, పాపరాజు అనే యిద్దరు కుమారులు కలిగిన వెనుక మూర్తెమ్మ

గౌరీ సన్నిధానతానకు పోయెను, గనుక తిరిగి కొన్ని దినములకు ఆ పుణ్యాత్ముడాయిన నర్సరాజుగారికి వేటపాలములోను అచ్యుతన్న నల్లపాపరాజు కుమార్తె నర్సమ్మను పునర్వివాహమయిన రెండో భార్యకు సంతానము లేకపోయెను. పెద్ద భార్యకుమారుడు అయినటువంటి వెంకట్రామప్ప పాపరాజు గారికి కలిగిన సంతతివయినము వ్రాస్తున్నాను. రామన్న కుమాళ్ళు పంచరత్నాలు అనిపించుకున్న అయిదుగురికి ముగ్గురికి సంతతి వ్రాస్తిని గనుక నాలుగవ ధార్మికుడు వెంకటపతి గారికి పయిడిఘంటం వారి యింటను వెంగమ్మ అనే పుణ్యాత్మురాలిని వివాహము అయి స్థలకరిణీకము చేసి భాగ్యవంతుడయి వున్న దినములలో కలిగిన సంతతి. సకల ధర్మ స్వరూపుడయిన రమణప్పగారున్ను కోదండయ్య అనే యిద్దరు కుమాళ్లున్ను కుమార్తెలు నలుగురు కలిగిరి. గనుక వారికి వివాహములున్ను నామాంకితాలున్ను వయినము. మంగమ్మను పోరూరి పేబన్నకున్ను పానమ్మను **టంగటూరు యల్లమరాజు** కుమార్డు నర్సన్నకున్ను రామమ్మ, లక్ష్మమ్మగారి యిద్దరినిన్ని పయిడిఘంటం చిన వెంకటపతి కుమార్డు దేవప్పకున్ను యీ రీతిని యిచ్చి వివాహము చేసినారు. ఆ సకల ధర్మస్వరూపులయ్ని రమణప్ప కోదండయ్యగారిలోను చిన్నవాడు కోదండయ్య నష్టమాయెను. ఆవంశకర్త అయిన భాగ్యపురుషుడు రమణప్పగారికి శిరిగిరి రాజు వెంకన్న గారికుమార్తె భాగ్యవతి పుణ్యాత్మురాలు నర్సమ్మను వివాహమయి సకల ధర్మాలు చేసి స్థళ కరిణీకములోను పేరు ప్రతిష్టలు గాను--------**రాజ రాజశ్రీ మందపాటి రామభద్రరాజుగారు రఘుపతి రాజుగారి** యేలుబడిని వీరితోను విరోధము పొసిగి సంగము మొదలుగాగల పశ్చమ రాజ్యము పోరు పెరుమాళ్లురెడ్డి రమణారెడ్డి గారికి తెచ్చి దేశము యేలించి కొంతకాలము గడిచిన పిమ్మటను రాజుగారితోను సఖ్యము చేసి రాజుగారికి **అద్దంకి, అమ్మనబ్రోలు పరగణాలుకు కావలి మన్నెరికము** వ్రాశి యిచ్చి యీ రీతిని భాగ్యవంతుడు అయివుండే కాలములోను కలిగిన సంతానము పంచరత్నాలు అయ్ను భాగ్యపురుషులు వారి నామాంకితాలు. రాజపూజ్యుడయిన నిర్వాహకుడు **వెంకట నారాయణప్ప** పుణ్యాత్ముఅయడయిన రామలింగన్న, ధార్మికుడు అయ్ను రామన్న వంశోద్ధారకుడు అయిన **వెంకటపతి.** ధర్మాత్ముడు నృశింహ్వాయి ఈ అయిదుని

కుమాళ్లున్ను కుమార్తెలు ముగ్గురు గనుక వారికి వివాహము చేసిన వైనము. పేరమ్మను కనుపర్తి ప్రసన్నప్ప కుమార్డు రఘునాయికులకున్ను, మాలకొండమ్మను పోరూరి మూర్తిరాజు కుమార్డు క్రిష్ణంరాజుకున్ను యిచ్చి ఈ రీతిగా వివాహములు చేసినారు.

15. ఆ కుమాళ్లు అయిదుగురికిన్ని పెద్దవాడు రాజపూజ్యుడు నిర్వాహకుడు అయిన వెంకట **నారాయణప్పకు** ముదివర్తి నర్సరాజు కుమార్తె నర్సమ్మను వివాహము అయి భాగ్యపురుషుడు అయి తండ్రి పరలోక ప్రాప్తి అయిన వెనుకను తమ్ములకు వివాహాలు వుపనయనాలు మొదలుగాగలివి కా చేయించి రాయవేలూరు **పోయి** ఆ ప్రభువు దర్శినము చేసి గుర్రం కోకలు తాళీ చేకట్ల జోడు -------అందుకుని దేశాదులు తేరుగడలు చేనుకొని దేశము మందపాటి రామభద్రరాజుగారి కుమార్డు అయిన రామచంద్రరాజుగారున్ను రఘుపతిరాజుగారి కొమాళ్లు అయ్ని పెద రామభద్రరాజుగారు న రామభద్రరాజుగారును వీరి యేలుబడిన వీరితో సఖ్యము చేసి దేశాహిగిరి చేసే రామరాజు కామేశ్వరరావు దేశాహిగారి దర్శనము చేసి నాలుగు నగలు వస్త్రాలు డాలు తలువారు మొదలుగాగల ఆయుధాలు పల్లకి మొదలుగాగల సకల బహుమాలాలున్ను అందుకొని అద్దంకి, అమ్మనబ్రోలు, చీమకుర్తి, పెళ్ళూరు స్థలకరిణీకము చేసి దరిసి సీమ స్థల కరిణీకముకు బహుయత్నాలు చేసి వెలుగోటి కుమార మాచమనాయుని గారి దరిశనము చేసి బహుమానాలు పొంది మణికేశ్వరములోను శ్రీమల్లేశ్వర స్వామివారికి **తేరు తిరుణాళ్లు మొదలుగాగల సకల మహెూత్సవములున్ను చేయించి మణికేశ్వరాన నేరేడు వనము వేయించి కోరిశపాటను భావులు** త్రవ్వించి ఒక కుమారుడున్ను ఒక కుమార్తెయున్ను కలిగిన వెనుకను దైవ సంకల్పము వల్లను పరలోకప్రాప్తుడు అయ్యెను. కొన్ని దినములకు ఆ కుమారుడున్ను కుమార్తెయున్ను నష్టమాయిపోయిరి. ఆ రమణప్పగారి రెండో కుమార్డు పుణ్యాత్ముడు అయిన రామలింగన్నగారి పయిడిఘంటం పానకాలు కుమార్తె నర్సమ్మను వివాహము చేసి భాగ్యపురుషుడయి ఉన్న దినములలోను కలిగిన సంతతి. కుమాళ్లు - మూడో కుమార్డు ధార్మికుడు అయిన రామన్నగారికిమేనమామ అయిన శిరిగిరిరాజు నర్సరాజు కుమార్తె పుణ్యాత్మురాలయిన బుచ్చమ్మను వివాహము అయి

కోరిశపాటను చెర్వు వేయించి మణికేశ్వరములోను మామిడి వనము వేయించి పూర్వము అన్న చేయించిన ధర్మము మల్లేశ్వరుని తేరు సిధిలమై పోకుండా బాగు చేయించి పేరు ప్రతిష్టగాను స్థళ కరిణీకాలు చేస్తూ రాజశ్రీ మందపాటి రఘుపతిరాజు గారి కుమార్డు అయిన చిన రామభద్రరాజుగారి యేలుబడ్ని ధర్మస్వరూపి, సజ్జనుడు అనిపించుకొని వున్న దినముల్లోను కలిగిన ఆడశిశువులు నలుగురు వారికి వివాహము చేశిన స్థళము - పెద్దకుమార్తె నర్సమ్మను అద్దంకి బుచ్చాన కుమార్డు పుల్లంరాజుకున్ను రెండవ కుమార్తె మేనల్లుడు అయిన పోరూరి క్రిష్ణంరాజు కుమార్డు పానకాలుకున్నుమూడోకుమార్తెను పయిడి ఘంటం----కుమార్డు అయిన భగవానులుకున్ను నాలుగో కుమార్తెను యిచ్చి ఈ రీతి వివాహాలు చేయించి పల్నాటి సీమకు పోయి పంచమహలు వ్యవహారము చేసే రామరాజు వీరభద్రరాయని చేతను పల్లకీలు మొదలుగాగల సకల బహుమానాలున్ను అందుకొని పేరు పౌరుషేయము సంపాద్యము చేసి కొంచెము కాలములోనే విష్ణులోక ప్రాప్తుడాయెను.

16. వంశోద్ధారకుడయిన నాలుగోకుమార్డు వేంకటపతికి జిళ్ళెళ్లమూడి రామభద్రయ్య కుమార్తె భాగ్యవతి మంగమ్మను వివాహమయి స్థళకరిణీకాలు మొదలుగాగల వ్యవహారములలోను ముఖ్యముగాను పేరు ప్రతిష్ట సంపాద్యము చేసి రాజశ్రీ మందపాటి చిన రామభద్రరాజు గారి కుమారుడు అయిన రఘుపతి రాజుగారి యేలుబడిని స్థళకరిణీకము చేసి దర్శి సీమల కరణీకము నిమిత్తము గాను రాజశ్రీ వెలుగోటి కుమార యాచమనాయుని కొమార్డు అయిన పెదయాచమ నాయునిగారి పేరిటను ప్రసిద్ధి పొందిన పెద్దన్న గారి దరిశనముచేసి దరిసి సీమకు స్థళకరిణీకానకు తగుము సూత్రాలు సాధకములు మొదలుగా గలవి చేయించి పల్నాడు సీమకుపోయి దేశాపా---అయిన రామరాజు వీరభద్రనాయుని గారి దరిశినము చేసి గుర్రం కోకలు మొదలుగాగల బహుమానాలు అందుకొని యీరీతి సంచరిస్తూ వుండ్ని మణికేశ్వరములోను చెరువువేయించె, వనము వేయించె. కోరిశపాటను హరిహరాల యములు ప్రతిష్టచేయించె. మణికేశ్వరము మల్లేశ్వరునకు పూర్వము అన్న చేయించిన ప్రతిష్ట తేరు తిరునాళ్ళు చేయించె ఆ కాలములో కలిగిన సంతతి. వంశకర్త అయిన కుమాళ్లు వారి నామాంకితములు పుణ్యాత్ముడయిన వెంకటనారాయణప్ప,

ధర్మాత్ముడయిన లక్ష్మీనరిశింహ్వామున్ను యీ యిద్దరును కుమారులున్ను కుమార్తె ఒక చిన్నది గనుక వివాహము చేసిన స్ధళము పొదిలెసీమ స్ధళకరణాలు పోలంరాజు కాశీరాజు కుమార్డు---(ఖాళీ)

17. అయిదవ కుమార్డు ధర్మాత్ముడయిన నరశింహ్వులకు దరిశి లింగరాజు కుమార్తె భాగ్యవతి అయన వెంకమ్మను వివాహము అయి పుణ్యాత్ముడు అనిపించి కొని రాజశ్రీ మందపాటి రామచంద్రరాజుగారి కొమార్డు రామభద్రరాజుగారి యేలుబడిన భాగ్యపురుషుడయి సంచరిస్తూ వుండే కాలములోను కలిగిన సంతతి కొమాళ్లు రామన్నగారి కుమాళ్లు పంచరత్నాలు అనిపించు సంతతికి నలుగురి సంతతి వ్రాశినాను మిగతా అయిదో పుణ్యస్వరూపి కడగొట్టు క్రిష్ణంరాజుకు మంచళ్ల వెంకటనాధుని కొమార్తె భాగ్యవతి పుణ్యస్వరూపి వెంకమ్మను వివాహమయి కలిగిన సంతతి. ధర్మస్వరూపులయ్ని భాగ్యవంతులు కొమాళ్లు. వెంకన్న ధర్మాత్ముడయిన నర్సరాజు పుణ్యాత్ముడు అయిన మంగరాజు ధార్మిక స్వరూపుడయిన రామలింగన్న పేరట నల్లపాపరాజు ఈ నలుగురున్ను కుమారులు. కుమార్తెలు యేదుగురు గనుక వీరికి వివాహము అయిన స్ధళాలు. నర్సమ్మను నంబూరి గిరెప్పకు--------చంద్రకున్ను లక్ష్మమ్మను తమ్మవరము యజ్ఞయ్యకున్ను గిరైయమ్మను మంచెళ్ల రామరాజుకున్ను బుచ్చెమ్మను టంగుటూరి వారికి శింగమ్మను పోలంరాజు పేర్రాజుకున్ను మంగమ్మను కరి వెంకటపతికిన్ని యీ ప్రకారము వివాహము చేసినాడు. కుమాళ్లు నలుగురికిన్ని ధర్మస్వరూపి పెద్దవాడు వెంకన్నకు అక్కిరాజువారి యింటను లింగమ్మను వివాహము చేసుకొని భాగ్యవంతుడు అయివుండె కాలములోను అక్కిరాజు వీరంరాజు రామరాజు శంకరప్పగారికి బావవరిది గనుక ఆ సంబంధానను--- యీ దేశాదులు---చేస్తూ వుండి శంకప్పగారితోను-----చేసి తన అల్లుడయిన వెంకన్నగారికి మాన్యాలు యిప్పించి నాదు గనుక దానపత్రిక పద్దతి---రామరాజు శంకరయ్య తరుపుదారు మహాల్లా----తరుపు కంతంగారు నీలంరాజు క్రిష్ణంరాజుకు యిచ్చిన భూదాన ధర్మశాసన క్రమమెట్లన్నను "**మా హవాలాన** నడిచె అద్దంకి అమ్మనబ్రోలు పరగణాలలోను మీ గ్రామ మిరాసి కల్వకూరను నీకు మా----వెంకన్నకు కుచ్చుల మాన్యము యిస్తిమిగనుక

హద్దులు పొందు దక్షిణానను తూర్పుకు దిశను రామకూరు బాట దక్షిణానకు కొ-----పొలము పడమరకు నీలంరాజు నరశింహ్వుని మాన్యము వుత్తరానకు జేనెపాడు యీ హద్దులులోగా నన్నూరు కుంటలు ప్రాప్తిని----కుచ్చల మాన్యము శ్రీభమరామల్లేశ్వరార్పితముగాని యిస్తిమి గనుక మీ పుత్రపౌత్ర పారంపర్యమున్ను ఆ చంద్రార్కస్థాయిగాను సుఖాన అనుభవించునది. యీ ప్రకారము మాన్యము సంపాదించుకొన్న--కొన్ని దినములు జీవించి నష్టము అయిన నందుక ధర్మస్వరూపుడయిన రెండో కుమార్డు కృష్ణనర్సరాజుకు కృష్ణంరాజుకు అన్న అయ్ని రామలింగన్న గారికి పెంచుకోనుయిచ్చెను. గనుక వారి సంతతి మునుపే వ్రాశినాను. మూడో కొమార్డు అయిన మంగరాజుకు కొణికి దామరాజు రామరాజు కొమార్తె సానమ్మను వివాహము చేసుకొని భాగ్యవంతుడయి ఉన్న దినములలో కలిగిన సంతతి

కొమార్డు క్రిష్ణంరాజు అనే పుణ్యాత్ముడు డ్ను

18. లక్ష్మమ్మను పోలం రాజు కొమారుడయిన వెంకట------కున్ను రమణమ్మను ---------కేశవుల కొమార్డు వెంకమ్మను రామరాజు సూర్యనారాయణకున్ను ఈ ప్రకారం వివాహము చేసిరి. కొమార్డు అయిన పుణ్యాత్ముడు క్రిష్ణంరాజు అద్దంకిల---- పెద్దభార్య కొమార్తె సుభద్రమ్మను వివాహము అయిన కొన్ని దినములకు ----------పునర్వివాహము తమ్మవరము. కొమార్తె అయిన వివాహము అయిన----గను---కల్గిన సంతతి ముందు వ్రాస్తున్నాను.

19. వంశోద్ధారకుడు అయిన చిన అన్నంరాజు భాగ్యపురుషుని కొమార్డు నీలంరాజు. నీలంరాజు పుణ్యాత్ముని కొమర్డు లక్ష్మయ్య, ఆ ధార్మికుని కొమార్డు ఆధార్మికుని కొమార్డు రాఘవయ్య ఆ రాఘవయ్యకు చిలుమూరు రామేశ్వరుని వరప్రసాదులయిన పుత్రులు అయిదుగురు గనుక వారిలో వంశోద్ధారకుడయిను కుమార రామలింగన్నగారి సంతతి వ్రాశినాము గనుక విశదముగా నెలవుతున్నది. జల్లిజడల రామలింగన్నగారి వారి విశదము. ఆ జట్టి రామలింగన్నకు రఘుపతి రాజున్ను గోవిందప్ప అనే యిద్దరు

కుమాళ్ళు గలిగి కొత్తకోటను కాపురం వుండి మహారాజులయి సంచరిస్తూ వున్న దినములలోను పెద్దవాడయిన రఘుపతిరాజుకు కలిగిన సంతతి -కోదండయ్య సీతారాముడు. అన్నగారు అయిన వారు నారశింహ్వుడు, రామలింగన్న యీ అర్గురున్న కొమాళ్లు కలిగిరి కన్కు అందరిలో పెద్దవాడు అయిన కోదండయ్య, తిరు వెంగళప్ప, రామక్రిష్ణప్ప, రమణప్ప కలిగినిరు. రామక్రిష్ణయ్య పెద్దవాడు. అయిదవ కొమార్తె.........ను

మంగళాద్రి కొమార్డు వెంకట చలముకు యిచ్చి వివాహము చేసిరి గనుక ఆ చిన్నది నష్టమయిపోయెను గనుక యితని సంతతి యింత- రెండవ కుమార్డు అయిన వెంగళప్ప ప్రధమ వివాహము దామరాజు రామరాజు కొమార్తె లక్ష్మమ్మ రెండో వివాహము చంద్రపాటి తిరుమలప్ప కొమార్తెను వివాహమయి సంతానము లేకపోయెను. 4వకొమార్డు పానకాలుకు పమిడిపాటి రమణప్ప కొమార్తె నాంచారమ్మను వివాహమయి వొక కొమార్తె గలిగెను. ఆ చిన్నదానిని సూరపరాజు రాముడికి యిచ్చి వివాహము చేసినారు. యితని సంతతి యింత. 5వ కొమార్డు రామక్రిష్నయ్య నష్టము అయెను. వంశోద్ధారకుడయ్ని 6వ కొమార్డు శీతారాముడికి ప్రధమ వివాహము కొత్తపల్లి వారింటను లక్ష్మమ్మను వివాహము అయి వొక కుమార్తె కలిగెను. తిరుమలమ్మ అనే ఆ కుమార్తెను బందా నర్సరాజు కొమార్డు మేనల్లుడు వెంకటనర్సుకు యిచ్చి వివాహం చేసినారు. ఆ భార్య నష్టము అయితే తిరిగి తిరిగి టంగుటూరి రామరాజు కొమార్తె లక్ష్మమ్మను . సంతతి

(యింతవరకే గలదు. వ్రాసినవారి వూరు తెలియదు. కాల నిర్ణయంలేదు. ఈ వ్రాతలో కొన్ని ప్రదేశాలు కాగితము సిధిలమై అక్షరములు లేక యేర్పడినది. 25,26 పేజీలు తాటాకులు విరిగిపోయి నవని వ్రాశిరి. అనగా ఆ రొండు పేజీల వారే పూర్తిగా వ్రాయలేదు.)

నీలంరాజు ఆదిమూర్తి

ఒంగోలు, 29-1-1948

దండ కవిలె

స్త్రీల పేర్లు


రామక్క
కామేశ్వరి
వెంగళమ్మ
ఎల్లమ్మ
లింగమ్మ
అక్కమ్మ
రంగమ్మ
తిమ్మమ్మ
మంగమ్మ
సానమ్మ
నర్సమ్మ
పేరమ్మ
మాలకొండమ్మ
లక్షమ్మ
జానకమ్మ
శాయమ్మ
మూర్తమ్మ
రామమ్మ
బుచ్చెమ్మ
వెంకమ్మ
గిర్రెయమ్మ
రమణమ్మ
నాంచారమ్మ
తిరుమలమ్మ

ఊర్ల పేర్లు

అద్దంకి
కశ్యపాపురం
కోరిశపాడు
కావలి
కొత్తపల్లి
కొణికి
కొండేపి (ఉప్పలపాడు)
గోలకొండ
ఘోరకవిపాలెం
చీమకుర్తి
తమ్మవరము
ధర్మవరం
పోరూరు
పాతళ్లపల్లె
మద్దులూరు
రాజమహేంద్రవరం
రాయవేలూరు
వేటపాలెం
సింగరికొండ
అమ్మనబ్రోలు
కనపర్తి
కొణిదెన
కొత్తకోట
కొండమంజులూరు
కటకం
గొనసపూడి
గన్నెపూడి
చిలుమూరు
జెనెపాడు
దర్శి
నందిగామ
పల్లామల్లి
పెళ్ళూరు
మందలపాడు
రామేశ్వరం
లక్కంరాజుపల్లె
విజయనగరం




నీలకంఠేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో కీ.శే.కడివేటి లక్ష్మీనారాయణరెడ్డి గారు, కోరిశపాడు గ్రామస్తులు



2003లో జీర్ణోద్ధరణ కృషిలో కీ.శే. నీలంరాజు వేంకటసుబ్బారావు

ధర్మకర్త : నీలంరాజు పార్థసారధి




లక్ష్మీనారాయణ మందిరంలో
ధర్మకర్త తల్లిదండ్రులు
కీ.శే.నీలంరాజు ఆదిమూర్తి దాసు,
వేంకటసుబ్బమ్మ గారలు




పార్వతీదేవి
నీలకంఠేశ్వరస్వామి
గుడి

జీర్ణోద్ధరణ కృషిలో గ్రామస్థులకు సన్మాన కార్యక్రమంలో
కీ.శే. నీలంరాజు వేంకటసుబ్బారావు
ప్రస్తుత ధర్మకర్త : నీలంరాజు పార్థసారధి







గోపు ఆంజనేయులు, కడివేటి విశ్వనాధరెడ్డి,
పూజారులతో బాబాయి, కుమారుడు



Tributes to,
Late **N.V. Subba Rao**

'Even in death he didnot for get to call his beloved'


- Editor



ఉత్తమ అర్చక అవార్డు గ్రహీత :
వేణుగోపాలస్వామి
దేవాలయ ప్రస్తుత పూజారి
రోంపిచర్ల
నరసింహాచార్యులు



మనగుడి కార్యక్రమంలో గ్రామస్థులు



వేణుగోపాలస్వామి ముక్కోటి గరుడోత్సవంలో

నీలంరాజు ఆదిమూర్తిదాసు గారు

1964 కొరిశపాడు



శ్రీ నీలకంఠేశ్వరస్వామి



శ్రీ నీలకంఠేశ్వరస్వామి దేవాలయం, కొరిశపాడు



గంగా పార్వతీ సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు

సంపాదకులు

నీలంరాజు పార్థసారథి



తల్లిదండ్రులు : శ్రీమాన్ నీలంరాజు ఆదిమూర్తి (దత్తత)
శ్రీమతి వేంకటసుబ్బమ్మ
శ్రీమాన్ అద్దంకి వేంకట భుజంగరావు (జనక)
శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ

విద్యాభ్యాసం : B.A. SS, (న్యాయ), M.A. (సంస్కృతం)
M.A. (తెలుగు), C.C (women laws)

ఉద్యోగం : విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు
1973 - 2003 వరకు ఓరియంటల్ కళాశాల, ఒంగోలు
సి.యస్.ఆర్. శర్మ కళాశాల, ఒంగోలు

సెమినార్స్ : 1. Oriental Conference in Tirupathi Waltar
2. R.C.C (women laws) 2003, Guntur
3. International Conference on Bhagavatha
2010 Tirupathi
(Paper on Vyasas Contribution to Text)

ఉపన్యాసము : రామాయణ భాగవతములు, తెలుగు సాహిత్యం,
నవల, త్యాగరాజ కృతులు

రచనలు : జ్యోతిషదీపిక, తిరుప్పావై, భారత భాగవత ఘట్టాలపై
రచనలు (కాలజ్ఞాన సుధ పత్రిక)

అముద్రితాలు : 1. Clouds (English Poetry), 2. Brahma Sutra 3. With Her
4. Upanishads, 5. ప్రవాహం (వచన కవితలు.

వ్యాసంగాలు : తంత్ర , జ్యోతిష, వేదాంత శాస్త్రముల, పరిశీలన.
త్యాగరాజ సంగీతోత్సవాలు, దేవాలయ ధర్మకర్తృత్వాలు
సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యముల నిరంతర పఠనం,
ఛైర్మన్ : నీలంరాజు చారిటబుల్ ట్రస్ట్ (2007),
అధ్యక్షులు : హిందూ దేవాలయ ధర్మకర్తల సంఘం,
ప్రకాశంజిల్లా శాఖ.

36